RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

ప్రచురణ: తిరుపతి | సంపుటి:3 | సంచిక : 295 | సంపాదకులు: కలిచేటి వెంకయ్య | సోమవారం 21 సెప్టెంబర్ 2026 | పేజీలు: 8 | వెల: 2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

నెల్లూరు నగరంలో పరుగులు పెడుతున్న అభివృద్ధి



వివరాలు 3లో

## విలేకరులు కావలెను

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

### ఇప్పుడు మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం

# దేవుడు నాకు ఇచ్చాడు: చంద్రబాబు





- బెంగళూరులో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభోత్సవం
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో కలిసి పాల్గొన్న సీఎం చంద్రబాబు
- గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు వెళ్లాలని పిలుపు
- అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ ముఖ్యమేనన్న సీఎం
- పర్యావరణ హిత నగరంగా అమరావతి నిర్మాణం చేపడతామని వెల్లడి

**బెంగళూరు:** బెంగళూరులోని వైట్ ఫీల్డ్ లో ఆదివారం జరిగిన 'ది ఎర్త్ సెంటర్ - విష్టా స్పేసెస్' ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి చంద్రబాబు ఈ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా సైబరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేశాను. ఇప్పుడు అమరావతి రూపంలో మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం నాకు దేవుడు ఇచ్చాడు" అని అన్నారు. ప్రకృతి, సాంకేతి కత, ఆధునిక మౌలిక వసతులతో అమరావతిని భవిష్యత్ తరాలకు అనువైన, పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన స్పష్టం చేశారు.

**గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు పయనం**

ప్రపంచం ఇప్పుడు 'గ్రే గ్రోత్' నుంచి 'గ్రీన్ గ్రోత్' వైపు దృష్టి సారించాల్సిన తరుణం ఆసన్నమైందని చంద్రబాబు పిలుపునిచ్చారు. "కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణ హిత నిర్మాణాల గురించి అందరూ ఆలోచించాలి. అభివృద్ధి ఆగకూడదు, అదే సమయంలో పర్యావరణానికి గాయం చేయకూడదు. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి" అని ఆయన సూచించారు. దశాబ్దాలుగా నగరాల విస్తరణ 'గ్రే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ఆధారంగా జరిగిందని, ఇప్పుడు గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజెనరేటివ్ గ్రోత్ వంటి విధానాలు అత్యవసరమని పేర్కొన్నారు. వనరులను అధికంగా వాడే భవనాలు కాకుండా, తెలివిగా వినియోగించుకునే నిర్మాణాలను చేపట్టాలని ఉద్బోధించారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకునే 'ది ఎర్త్ సెంటర్' నిర్మాణం మిగతా 2లో...



## క్లాస్‌రూం నుంచే సమాజ మార్పు సాధ్యం

### మంత్రి నారా లోకేశ్

- కాకినాడలో చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 'భారతీయం' కార్యక్రమం
- హాజరైన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- సాంకేతికతకు భారతీయ విలువలు జోడించి ప్రపంచ విజేతలుగా ఎదగాలని పిలుపు
- ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే ఏపీ విద్యావ్యవస్థ దేశంలోనే నెం.1 అవుతుందని వ్యాఖ్యలు
- త్యాగధనుల బాటలో పయనించి దేశానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచన

కాకినాడ ( సింధూర దర్శిని) 20 సెప్టెంబర్: కాకినాడ సాంకేతికతకు భారతీయ విలువలను జోడించడం ద్వారా విద్యార్థులు ప్రపంచ విజేతలుగా ఎదగాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ దేశంలోనే నెంబర్ వన్ గా రూపుదిద్దుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల విద్యాశాఖ, ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 'భారతీయం' పేరుతో నిర్వహించిన ఈ దేశభక్తి కార్యక్రమానికి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "క్లాస్‌రూం నుంచే సమాజంలో మార్పు సాధ్యం. అందుకే నేను విద్యాశాఖను ఎంచుకున్నాను. దేశభక్తి, నైతిక విలువలే మన కుటుంబ వ్యవస్థకు పునాది" అని అన్నారు. త్యాగధనులే మనకు మార్గదర్శకులని, వారి బాటలో పయనించి ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, దేశానికి గర్వకారణంగా నిలవాలని లోకేశ్ మార్గనిర్దేశం చేశారు.



## ఒకే ఫ్రేమ్‌లో శుక్రుడు, పాలపుంత..

### నాసా వ్యోమగామి షేర్ చేసిన అద్భుత చిత్రం!

- అంతరిక్షం నుంచి అద్భుతమైన ఫొటో షేర్ చేసిన నాసా వ్యోమగామి
- ఒకే చిత్రంలో శుక్రగ్రహం, పాలపుంత, భూమి వాతావరణం
- భూమి ఎర్రటి వాతావరణ కాంతిలో ఉదయిస్తున్న శుక్రుడు
- అరుదైన దృశ్యంపై నెటిజన్ల నుంచి ప్రశంసల వర్షం

2లో



## దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె..

### ఖాతాదారులకు ఎస్‌బీఐ కీలక సూచన

- ఈ నెల 28 నుంచి 30 వరకు దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె
- బ్యాంకు పనులు ముందే పూర్తి చేసుకోవాలని కస్టమర్లకు ఎస్‌బీఐ సూచన
- వారాంతపు సెలవులతో కలిపి ఐదు రోజుల పాటు సేవలకు అంతరాయం
- ఏటీఎం, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ సేవలు యథాతథంగా కొనసాగుతాయని వెల్లడి
- 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' సమ్మెకు పిలుపు

**ఢిల్లీ:** దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ ఖాతాదారులకు ఒక ముఖ్యమైన ప్రకటన జారీ చేసింది. 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా బ్యాంకులు సమ్మెకు దిగనున్నాయి. అయితే, దీనికి ముందు సెప్టెంబర్ 26, 27 తేదీలు శని, ఆదివారాలు కావడంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖలలో ప్రత్యక్ష సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని ఎస్‌బీఐ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమైన బ్యాంకు లావాదేవీలు ఉన్నవారు సమ్మె కంటే ముందే వాటిని పూర్తి చేసుకోవాలని సూచించింది. యూఎఫ్‌బీయూ తమ ఆందోళనలో భాగంగా ఇప్పటికే సెప్టెంబర్ 11న ఒకరోజు సమ్మె నిర్వహించింది. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల చివరలో మరోసారి నిరసనకు సిద్ధమైంది. అంతే కాకుండా అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు కూడా పిలుపునివ్వడంతో మిగతా 2లో...

## యెమెన్‌లో భీకర పోరు..

### 24 గంటల్లో 44 మంది మృతి

- యెమెన్‌లో ప్రభుత్వ దళాలు, హౌతీల మధ్య భీకర పోరు
- తాయిజ్, లహజ్ ప్రావిన్సుల్లో కొనసాగుతున్న ఘర్షణలు
- వ్యూహాత్మక ప్రాంతాలకు బలగాలను తరలిస్తున్న ఇరు పక్షాలు

**యెమెన్:** యెమెన్‌లో ప్రభుత్వ దళాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. గత 24 గంటల్లో జరిగిన భీకర పోరులో కనీసం 44 మంది మరణించినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. దేశ నైరుతి ప్రాంతంలోని తాయిజ్, లహిజ్ ప్రావిన్సుల్లో ఈ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తాయిజ్ ప్రావిన్సులోని మిగతా 2లో...





## నైలు డెల్టాలో అరుదైన

### రాతి సమాధులు గుర్తింపు

- న్యూ కింగ్‌డమ్ కాలం నాటివిగా నిర్ధారణ
- రెండు విభిన్న నిర్మాణ శైలులతో ఆకట్టుకుంటున్న సమాధులు
- ఆ కాలం నాటి ఖనన పద్ధతులపై కొత్త ఆధారాలు లభ్యం

**ఈజిప్టు:** ఈజిప్టు రాజధాని కైరోకు ఉత్తరాన ఉన్న కల్యూబియా ప్రావిన్స్‌లోని 'టెల్ ఎల్-యహుదియా' ప్రాంతంలో పురాతత్వ శాస్త్రవేత్తలు చేపట్టిన తవ్వకాల్లో కొన్ని రాతి సమాధులు వెలుగులోకి వచ్చాయి. ఇవి 'న్యూ కింగ్‌డమ్' కాలానికి (క్రీ.పూ. 1550--1069) చెందినవని పరిశోధకులు నిర్ధారించారు. ఈజిప్టు పర్యాటక, పురావస్తు మంత్రిత్వ శాఖ శనివారం ఈ వివరాలను మిగతా 2లో...

## ఇప్పుడు మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం దేవుడు నాకు ఇచ్చాడు: చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

జరిగిందని, ఇలాంటి భవనాలకే భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు ప్రశంసించారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ, రీ-సైకిల్ చేసిన టెర్రకోట వంటి పదార్థాలతో ఈ భవనాన్ని నిర్మించడం అభినందనీయమని అన్నారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వాతావరణ మార్పులనేవి భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య కాదని, ఇప్పటికే మన ముందున్న పెను సవాలని చంద్రబాబు హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని కోరారు. భవన నిర్మాణాల్లో 'నెట్ జీరో' విధానాన్ని పాటించాలని, సోలార్ విద్యుత్ వినియోగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. "ప్రతి ఇంటి పైకప్పు ఒక పవర్ ప్లాంట్‌గా మారవచ్చు. ప్రతి నీటి చుక్కను తిరిగి వినియోగించవచ్చు. ప్రతి వ్యర్థాన్ని ఒక వనరుగా మార్చవచ్చు. నీటిని, నేలను కాపాడటమంటే సంపదను సృష్టించడమే" అని ఆయన వివరించారు. చెత్తను కంపోస్టుగా మార్చుకోవడం, రీ-యూజ్ విధానాన్ని అవలంబించడం ద్వారానే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ కర్ణాటక, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని అన్నారు.

### అమరావతి - ఒక పర్యావరణ హిత నగరం

వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ గురించి మాట్లాడుతున్నామని, పట్టణాభివృద్ధిలోనూ అదే స్ఫూర్తి అవసరమని చంద్రబాబు అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి సాధించాలనే జాతీయ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా ఉంటుందని తెలిపారు. ఏపీలో సుమారు 165 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రణాళిక చేస్తున్నామని వెల్లడించారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రకృతిని పరిరక్షిస్తూ ఈ అద్భుత ప్రాజెక్టును రూపొందించిన విస్టా స్పేసెస్ బృందాన్ని, వెంకటరమణన్ అసోసియేట్స్ ప్రతినిధులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

## దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె..

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంకింగ్ రంగంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎస్‌బీఐ ఈ ముందస్తు సలహాలు జారీ చేసింది. సమ్మె సమయంలో బ్రాంచ్‌లలో సిబ్బంది సహాయం అవసరమయ్యే పనులు, డాక్యుమెంట్ల పరిశీలన, కొన్ని రకాల చెక్కుల ప్రాసెసింగ్ వంటి సేవలకు ఆటంకం కలగవచ్చని బ్యాంకు స్పష్టం చేసింది. సమ్మెలో ఎంతమంది ఉద్యోగులు పాల్గొంటారనే దానిపై బ్రాంచ్‌ల పనితీరు ఆధారపడి ఉంటుందని తెలిపింది. అయితే, వినియోగదారులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని కోరింది.నగదు అవసరాల కోసం ఏటీఎంలు, ఆటోమేటెడ్ డిపాజిట్ అండ్ విత్‌డ్రాయల్ మెషీన్లు (ఏడీడబ్ల్యూఎం), అలాగే కస్టమర్ సర్వీస్ పాయింట్లు (సీఎస్‌పీ) అందుబాటులో ఉంటాయని ఎస్‌బీఐ పేర్కొంది. వీటితో పాటు ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యోనో, యూపీఐ వంటి డిజిటల్ సేవలు యథాతథంగా పనిచేస్తాయని స్పష్టం చేసింది. నిధుల బదిలీ, ఆన్‌లైన్ చెల్లింపులు వంటి వాటిని ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎలాంటి ఆటంకం లేకుండా చేసుకోవచ్చని వివరించింది. అయితే, భౌతికంగా బ్రాంచ్‌కు వెళ్లాల్సిన పనులను మాత్రం ముందుగానే ప్లాన్ చేసుకోవడం ఉత్తమమని ఖాతాదారులకు సూచించింది.

## ఒకే ఫ్రేమ్‌లో శుక్రుడు, పాలపుంత.. నాసా వ్యోమగామి షేర్ చేసిన అద్భుత చిత్రం!

అంతరిక్షం నుంచి మన భూమి, ఇతర గ్రహాలు ఎలా కనిపిస్తాయో వివరిస్తూ వ్యోమగాములు పంచుకునే ఛాయాచిత్రాలు ఎప్పుడూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి. తాజాగా నాసా వ్యోమగామి డోన్ పెటిట్ పంచుకున్న ఒక అద్భుతమైన చిత్రం ప్రస్తుతం ఇంటర్నెట్‌లో అందరినీ ఆకట్టుకుంటోంది. కక్ష్య నుంచి తీసిన ఈ చిత్రంలో పలు ఖగోళ అద్భుతాలు ఒకే ఫ్రేమ్‌లో బందీ కావడం విశేషం.ఈ చిత్రంలో భూ వాతావరణంలోని ఎర్రటి కాంతుల (ఎయిర్‌గ్లో) గుండా ప్రకాశవంతమైన శుక్ర గ్రహం ఉదయిస్తున్నట్లు కనిపిస్తోంది. దిగువ భాగంలో ఊదా రంగులో మెరుస్తున్న వాతావరణ కాంతులు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఈ ఛాయాచిత్రాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ డోన్ పెటిట్ ఒక ఆసక్తికరమైన వ్యాఖ్యను జోడించారు. "భూమి ఎర్రటి వాతావరణ కాంతిలో ఉదయిస్తున్న శుక్రుడు.. గ్రహం పైన పాలపుంత కనిపిస్తోంది.. కింద ఊదా రంగు మెరుపులు ప్రకాశిస్తున్నాయి.. అనంతమైన నక్షత్రాల మధ్య రెండు తపాను ప్రపంచాలు మెరుస్తున్నాయి" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు.ఈ ఫొటో చూసిన నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. "అద్భుతం" అంటూ రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు. శుక్ర గ్రహం, పాలపుంత, భూ వాతావరణంలోని అద్భుతమైన రంగులు ఒకేచోట కనిపించడం చాలా అరుదని, ఇది కళ్లకు కనులపండువ చేసే దృశ్యమని అభిప్రాయపడుతున్నారు. అంతరిక్షం నుంచి మన గ్రహాన్ని, విశ్వాన్ని వీక్షించడం ఒక ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుందని ఈ చిత్రం మరోసారి నిరూపించింది.

## నైలు డెల్టాలో అరుదైన రాతి సమాధులు గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

అధికారికంగా వెల్లడించింది. సాధారణంగా నైలు నది డెల్టా ప్రాంతంలో బంకమట్టి అధికంగా ఉండటం వల్ల అక్కడ రాతితో నిర్మించిన సమాధులు కనిపించడం అత్యంత అరుదు. ఈ నేపథ్యంలో తాజా ఆవిష్కరణకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. ఈ సమాధులు రెండు విభిన్న నిర్మాణ శైలులను కలిగి ఉన్నాయి. కొన్నింటికి మెట్ల మార్గం ద్వారా లోపలికి వెళ్లే సౌకర్యం ఉండగా, మరికొన్నింటిలో దీర్ఘచతురస్రాకారపు గొయ్యి నుంచి రెండు ఖనన గదుల్లోకి దారి ఉంది. తూర్పు డెల్టా ప్రాంతంలో వివిధ కాలాల్లో ఖనన పద్ధతులు ఏ విధంగా పరిణామం చెందాయో అధ్యయనం చేయడానికి ఈ ఆవిష్కరణ విలువైన ఆధారంగా నిలుస్తుందని ఈజిప్టు సుప్రీం కౌన్సిల్ ఆఫ్ యాంటిక్విటీస్ సెక్రటరీ జనరల్ హిషామ్ ఎల్-లీతీ పేర్కొన్నారు.కాగా, గత వారం సక్కారా సమీపంలో సుమారు 4,000 ఏళ్లకు పైగా పురాతనమైన మరో సమాధిని సైతం కనుగొన్నట్లు అధికారులు తెలిపారు. ఐదో రాజవంశానికి చెందిన 'యున్మిన్' అనే ఉన్నతాధికారి, ఆయన తండ్రి 'ఇటి'కి చెందిన సమాధిగా దీనిని గుర్తించారు.

## మోదీ మారథాన్ దౌత్యం.. రెండున్నర రోజుల్లో 15 భేటీలు!

- ఏ దేశం ఒత్తిడికీ లొంగి నిర్ణయాలు తీసుకోబోమన్న భారత్
- ప్రజల ప్రయోజనాలకే తమ ప్రథమ ప్రాధాన్యమన్న కేంద్ర ప్రభుత్వం
- తమ విదేశాంగ విధానం స్వతంత్రంగానే ఉంటుందన్న భారత్



**ఢిల్లీ:** రష్యాపై విధించిన ఆంక్షల విషయంలో ఏ దేశం ఒత్తిడికీ తలొగ్గే ప్రసక్తే లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. తమ విదేశాంగ విధానం అత్యంత స్వతంత్రమైనదని, జాతీయ ప్రయోజనాలే పరమావధిగా నిర్ణయాలు తీసుకుంటామని తేల్చిచెప్పింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సెప్టెంబర్ 18న "లిండ్సే గ్రాహం సాంక్షనింగ్ రష్యా, ఇరాన్ యాక్ట్-2026"పై సంతకం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ స్పందిస్తూ.. భారత ప్రభుత్వానికి దేశ ప్రజల ప్రయోజనాలే అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు. "ప్రజలకు మేలు చేసే ప్రతి నిర్ణయాన్నీ ప్రభుత్వం తీసుకుంటుంది. మా నిర్ణయాలు ఏ దేశ ఒత్తిడితోనూ ప్రభావితం కావు" అని ఆయన స్పష్టం చేశారు. దేశ బలం, స్థిరత్వమే తమ విదేశాంగ విధానానికి పునాదులని ఆయన వివరించారు. అమెరికా తీసుకువచ్చిన ఈ నూతన చట్టం ప్రకారం.. రష్యా నుంచి చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి ఉంటుంది. రష్యా నుంచి పెద్ద ఎత్తున ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనా వంటి దేశాలు ఈ చట్టం పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది.ఈ పరిణామాల వల్ల ఇంధన, వాణిజ్య రంగాల్లో భారత్‌కు కొన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ.. తుది నిర్ణయాలు మాత్రం దేశీయ అవసరాలు, జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది.

## 33 గంటల జర్నీ.. ప్రయాణికులకు ఫ్రీ భోజనం.. ఇదే ఆ రైలు



సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికులకు ఉచిత భోజనం 2,000 కిలోమీటర్లకు పైగా సాగే రైలు ప్రయాణం న్యూఢిల్లీ సహా పలు స్టేషన్లలో లంగర్ ఏర్పాటు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేత అన్ని తరగతుల ప్రయాణికులకు ఒకే భోజనం దాతలు, స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో సేవ రైలు ప్రయాణం అంటే చాలామందికి ముందుగా గుర్తొచ్చేది స్టేషన్లలో దొరికే ఆహారం, ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం, రైల్లో అమ్మే మీల్స్. కానీ ఓ రైలులో మాత్రం ప్రయాణికులకు ఉచితంగా భోజనం అందుతుంది. అది కూడా ఒక్కసారి కాదు.. దాదాపు 33 గంటల సుదీర్ఘ ప్రయాణంలో పలుసార్లు ఉచిత భోజనం అందుతుంది. అదే మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు నడిచే సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్. ఈ ఉచిత భోజన సర్వీస్ భారతీయ రైల్వే, లేదా ఐఆర్‌సీటీసీ ఇస్తున్న సదుపాయం కాదు. సిక్కుల రెండు పవిత్ర క్షేత్రాలను కలిపే ఈ రైలు ప్రయాణంలో దశాబ్దాలుగా 'లంగర్' అందించే సంప్రదాయం కొనసాగుతోంది. నాందేడ్‌లో తఖ్త్ సచ్‌ఖండ్ శ్రీ హజూర్ సాహిబ్ ఉంది. అమృత్‌సర్‌లో స్వర్ణ దేవాలయంగా పేరొందిన హర్మందిర్ సాహిబ్ ఉంది. ఈ రెండు పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ కీలక రవాణా మార్గంగా ఉంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం తఖ్త్ సచ్‌ఖండ్ శ్రీ హజూర్ సాహిబ్ అధికారిక వెబ్‌సైట్, టైమ్స్ ఆఫ్ ఇండియా కథనాల ప్రకారం.. ఈ రైలులో ప్రయాణికులకు ఉచిత లంగర్ అందించే సంప్రదాయం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. రైల్వేలో ఎన్నో మార్పులు వచ్చినా ఈ సేవ మాత్రం ఆగలేదు. సేవాభావం, దాతృత్వం, అందరికీ సమానంగా భోజనం అందించాలనే సిక్కు సంప్రదాయాన్ని ఇది ప్రతిబింబిస్తోంది.

**2,000 కిలోమీటర్ల ప్రయాణంలో..**

సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ 2,000 కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తుంది. దాదాపు 39 స్టేషన్లలో ఆగుతుంది. సుమారు 33 గంటల ఈ ప్రయాణంలో న్యూఢిల్లీ, భోపాల్, పర్భణి, జాల్నా, ఔరంగాబాద్ వంటి ప్రధాన స్టేషన్ల వద్ద లంగర్ ఏర్పాటు చేస్తారు. ప్రయాణికులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందిస్తారు.

### అందరికీ ఒకే భోజనం

లంగర్ అంటే సామూహిక వంటశాల. ఇందులో కులం, మతం, ఆర్థిక స్థాయి, సామాజిక హోదాతో సంబంధం లేకుండా అందరికీ భోజనం పెడతారు. సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌లోనూ ఇదే విధానం కనిపిస్తుంది. జనరల్ కోచ్‌లో ప్రయాణించే వారైనా, ఏసీ బోగీల్లో ఉన్నవారైనా ఒకే భోజనం అందుకుంటారు.

### సాధారణమైనా కడుపు నింపేలా..

లంగర్‌లో సాధారణంగా పప్పు, శనగలతో చేసిన కూర, వేడి కిచిడీ, ఆలుగడ్డ కూర, కాలీఫ్లవర్ వంటి కూరగాయల వంటకాలు ఉంటాయి. ప్రయాణికులు తమ ప్లేట్లు లేదా డబ్బాలు తెచ్చుకుని భోజనం తీసుకుంటారు. దీంతో వ్యర్థాలు తగ్గడంతో పాటు పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యం లభిస్తుంది.ఈ సేవకు వివిధ గురుద్వారాలకు చెందిన దాతలు, స్వచ్ఛంద కార్యకర్తలు సహకరిస్తారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఇతరులకు సేవ చేయాలనే 'సేవా' భావన ఇందులో కనిపిస్తుంది. అందుకే సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణం చాలామందికి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే ప్రయాణం మాత్రమే కాదు. భక్తి, సేవ, సమానత్వాన్ని అనుభవించే ప్రత్యేక అనుభవంగా మారుతోంది.

## యెమెన్‌లో భీకర పోరు.. 24 గంటల్లో 44 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

అల్-కదా, అల్-వాజియా ప్రాంతాల్లో హౌతీలు జరిపిన దాడులను ప్రభుత్వ బలగాలు తిప్పికొట్టాయి. ఈ ఘర్షణల్లో ఆరుగురు ప్రభుత్వ సైనికులు, 11 మంది హౌతీ సాయుధులు మరణించారు. మరోవైపు, లహిజ్ ప్రావిన్సులో వ్యూహాత్మకంగా కీలకమైన బాబ్ అల్-మండెబ్ జలసంధి సమీపంలోని కహబూబ్ పర్వత ప్రాంతం స్వాధీనం కోసం జరిగిన పోరులో 12 మంది సైనికులు, ఒక కమాండర్‌తో సహా 15 మంది హౌతీ తిరుగుబాటుదారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల ఆరంభంలో హౌతీ రెబల్స్ కీలకమైన మోఖా నౌకాశ్రయంతో పాటు బాబ్ అల్-మండెబ్ జలసంధిలోని మయూన్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో ఈ తాజా ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఇరు పక్షాలు ఎర్ర సముద్ర మార్గంలోని వివాదాస్పద ప్రాంతాలకు భారీగా బలగాలను తరలిస్తున్నాయి.2014లో హౌతీలు రాజధాని సనాతో పాటు దేశంలోని ఉత్తర ప్రాంతాలను ఆక్రమించడంతో యెమెన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైంది. అనంతరం 2015లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు రంగంలోకి దిగాయి. అప్పటి నుంచి దేశంలో ఘర్షణలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి.

## వైభవంగా సిద్ధి-బుద్ధి సమేత సంపత్ గణపతి కళ్యాణం





బాపట్ల, (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్: బాపట్ల మండలం కొత్తపాలెంలోని శ్రీ మహర్షి ఆశ్రమ గోశాలలో సంపత్ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సిద్ధి--బుద్ధి సమేత సంపత్ గణపతి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారికి విశిష్ట పూజలు, మండపారాధన, గోపూజలు నిర్వహించి అనంతరం కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మహా ప్రసాద వితరణ చేపట్టారు. సంపత్ గణపతి పరివార్, శ్రీరామ పారాయణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### భక్తి సందేశాలతో వారుణాసి' బాల వికాస్ ప్రదర్శనలు

బాపట్ల మేజర్ న్యూస్: పట్టణంలోని కొండలరావు వీధిలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా వారుణాసి బాల వికాస్ బాపట్ల ఆధ్వర్యంలో బాలబాలికలు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. కృష్ణార్జున సంవాదం, భక్తియోగం, పురుషోత్తమ ప్రాప్తియోగం, భగవద్గీత--జీవన విధానం, శ్రీమద్భగవద్గీత రహస్యాలు వంటి అంశాలను నాటక రూపంలో ప్రదర్శించారు. బాలబాలికల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బాలబాలికలు, భక్తులు పాల్గొన్నారు.

# నెల్లూరు నగరంలో పరుగులు పెడుతున్న అభివృద్ధి

- పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ
- రూ.57.25 లక్షలతో ఆధునీకరించిన వాటర్ ట్యాంక్ ప్రారంభం.. పాఠశాల స్థల పరిశీలన
- పీఎన్ఎం హైస్కూల్, మున్సిపల్ ఉర్దూ పాఠశాలల ఆధునీకరణ పనులకు శంకుస్థాపన
- పొర్లుకట్టలో రూ.90 లక్షలతో సీసీ డ్రెయిన్ పనులకు భూమిపూజ
- నెల్లూరును రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి నారాయణ

నెల్లూరు (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఆదివారం విస్తృతంగా పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు చేశారు. మంత్రి పర్యటించిన ప్రతి ప్రాంతంలో స్థానికులు ఘనస్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు.జాకీర్ హుస్సేన్ నగర్‌లో రూ.57.25 లక్షలతో ఆధునీకరించిన వాటర్ ట్యాంకును మంత్రి నారాయణ ప్రారంభించారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.జెండావీధిలోని పీఎన్ఎం హైస్కూల్, మున్సిపల్ ఉర్దూ పాఠశాలల ఆధునీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చి విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.పొర్లుకట్టలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. అదే ప్రాంతంలో రూ.90 లక్షలతో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ పనులకు భూమిపూజ చేశారు. ఎన్నికల సమయంలో పొర్లుకట్ట ప్రాంత ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, వాటిని పరిష్కరిస్తానని తాను హామీ ఇచ్చానని మంత్రి తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశామని చెప్పారు.డిసెంబర్ నెలాఖరులోగా పొర్లుకట్టలో మరుగుదొడ్లు, కనెక్టివిటీ రోడ్ల పనులతో పాటు సంగం బ్యారేజ్ నుంచి మంచినీటి సరఫరా పనులను పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసి వెళ్లిందని, అందువల్ల మొదటి ఏడాది అభివృద్ధి పనులకు కొన్ని ఆటంకాలు ఎదురయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అపార





అనుభవంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడంతో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని చెప్పారు.రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో రూ.43 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిన ప్రభుత్వం లేదన్నారు. నెల్లూరు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.వాయు కాలుష్య నియంత్రణలో నెల్లూరుకు ర్యాంకు రావడం సంతోషకరమని మంత్రి తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కలిగేలా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగుతాయని చెప్పారు. నగరంలోని పార్కులను ఆధునీకరించి ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు.

తాను టైమ్ పాస్ కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజాసేవే పరమావధిగా భావించి రాజకీయాల్లోకి వచ్చానని మంత్రి నారాయణ తెలిపారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా తాను పట్టించుకోనని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపైనే తన దృష్టి ఉంటుందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమమే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి పరంపర కొనసాగుతోందన్నారు. మంత్రి నారాయణ ఆధ్వర్యంలో పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చడంతో పాటు రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు.పేదల అభ్యున్నతి కోసం మంత్రి నారాయణ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని అబ్దుల్ అజీజ్ తెలిపారు. నగరంలోని పార్కులను ఆధునీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో మేయర్ సుజాత, కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మీకోసం-ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ వీవవనిశీయ్ఖి.ఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించిన సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం లిలి"సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ను అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు చేసిన ఫిర్యాదుల



పరిష్కారంపై వారి అభిప్రాయాలను నేరుగా సేకరించి, పరిష్కార నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, పౌర సేవా కేంద్రాల్లో ప్రదర్శించిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ను ఫిర్యాదుదారులు స్కాన్ చేసి తమ సమస్య పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ నమోదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణతో పాటు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ప్రదర్శనకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేయడమైనది.అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందడంతో పాటు, సమస్య పరిష్కారమైన అనంతరం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను నమోదు చేసి ప్రజా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# కసాపురం నుండి గణపయ్యకు పట్టువస్త్రాలు

- ఆలయ ఈవో పెంచల కిషోర్

కాణిపాకం (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం 2026 వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవస్థానం కసాపురం నుండి శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించిన శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవస్థానం ఈ.వో విజయరాజు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ గారు, ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు సుధాకర్ రెడ్డి, చంద్రకళ, కృష్ణవేణి, వసంత, శ్రీవాణి, కసాపురం దేవస్థానం అర్చకులు, వేద పండితులు, ఆలయ అధికారులు, కాణిపాకం దేవస్థానం ఏఈఓ ధనపాల్, ధనంజయ,





సూపర్డెంట్లు వాసు, కోదండపాణి, అర్చకులు వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.



## తాళమ్మ దేవస్థానంలో హుండీ లెక్కింపు

గూడూరు ( సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; గూడూరు గ్రామదేవత శ్రీశ్రీశ్రీ తాళమ్మ దేవస్థానంలో ఆదివారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి, కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో జరిగిన ఈ లెక్కింపులో 2026 జూన్ 7 నుంచి సెప్టెంబర్ 20 వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.79,525 ఆదాయం వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.భక్తులపై తాళమ్మ తల్లి దివ్య ఆశీస్సులు, అభయహస్తం ఎల్లవేళలా ఉండాలని ఆలయ ధర్మకర్తల మండలి ఆకాంక్షించింది.

## తాళమ్మ దేవస్థానంలో హుండీ లెక్కింపు









గూడూరు ( సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; గూడూరు గ్రామదేవత శ్రీశ్రీశ్రీ తాళమ్మ దేవస్థానంలో ఆదివారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి, కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో జరిగిన ఈ లెక్కింపులో 2026 జూన్ 7 నుంచి సెప్టెంబర్ 20 వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.79,525 ఆదాయం వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.భక్తులపై తాళమ్మ తల్లి దివ్య ఆశీస్సులు, అభయహస్తం ఎల్లవేళలా ఉండాలని ఆలయ ధర్మకర్తల మండలి ఆకాంక్షించింది.

## జాతీయ రహదారి కారంచేడు లిమిట్స్‌లో రోడ్డు ప్రమాదం ఒకరి మృతి



కారంచేడు, ( సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ వాడరేవు పిడుగురాళ్ల జాతీయ రహదారి 167 ఏ కారంచేడు లిమిట్స్ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బొడవాడ గ్రామానికి చెందిన వారు ద్విచక్ర వాహనంపై వాడరేవు నిమజ్జనానికి వెళ్లి తిరిగి వస్తూ వెనక నుండి ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన వ్యక్తిని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



## రామలింగాపురంలో ఘోర విషాద ఘటన

- ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి యత్నం
- విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి
- మృతులు తండ్రీ కొడుకులు గా గుర్తింపు
- చెన్నూరుకు చెందిన వారిగా గుర్తించిన పోలీసులు

గూడూరు (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; గూడూరు మండలం రామలింగాపురం గ్రామంలో అర్ధరాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేసేందుకు వచ్చినట్లు అనుమానిస్తున్న ఇద్దరు వ్యక్తులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. చోరికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు స్కూటీ పై వచ్చి దూరంగా ఉంచినట్లు స్థానికులు గుర్తించారు. ఘటనా స్థలంలో లభించిన స్కూటీ నంబర్‌ను పరిశీలించగా, అది ఓజిలి మండలం సగుటూరు గ్రామానికి చెందిన ఓ మహిళ పేరుతో నమోదై ఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న గూడూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని ఘటనపై దర్యాప్తు చేపట్టారు. గూడూరు రూరల్ పోలీసులు సమాచారం మేరకు తండ్రీ,కొడుకులు కాగా వారు గూడూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నేడు మంత్రి కొలుసు పార్థసారథి నెల్లూరు జిల్లా పర్యటన



నెల్లూరు ( సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి నేడు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలకు కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి ఉదయం 9.30 గంటలకు ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటారు. ఉదయం 9.30 గంటల నుంచి 10.15 గంటల వరకు ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్, ఇతర సభ్యులతో సమావేశంలో పాల్గొని, పలు అభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించడంతో పాటు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ఉదయం 10.15 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి టిడ్కో గృహాల వరకు నిర్వహించే బైక్ ర్యాలీలో పాల్గొంటారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టిడ్కో గృహాల వద్ద శ్రీ కోదండ రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ఆత్మకూరు టిడ్కో గృహాల నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకి చేరుకుంటారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆ ప్రకటనలో తెలిపారు.

## చేతివృత్తులకు చేయూతనివ్వాలి



బాపట్ల, ( సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ ; తరతరాలుగా సంప్రదాయ చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుమ్మరులను ప్రభుత్వం ఆదుకోవాలని, వారి ఆర్థిక అభివృద్ధికి రుణాలు మంజూరు చేయాలని బాపట్ల జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు మోతుకూరి శివ కోటేశ్వరరావు కోరారు. ఆదివారం బాపట్ల--సూర్యలంక రహదారి పక్కన ఉన్న శ్రీకృష్ణ ఆశ్రమం వద్ద నిర్వహించిన జిల్లా శాలివాహన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బాపట్ల నియోజ కవర్గ శాలివాహన సంఘ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా పురిటి హరికృష్ణ, చైర్మన్‌గా ఇంటూరి శ్రీనివాసరావును ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శితో పాటు కార్యనిర్వాహక సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పురిటి హరికృష్ణ మాట్లాడుతూ, 50 సంవత్సరాలు నిండిన కుమ్మరులకు పింఛన్లు మంజూరు చేయాలని, కుమ్మరి వృత్తిని కొనసా గిస్తున్న వారికి అవసరమైన పనిముట్లు, సదుపా యాలు కల్పించాలని కోరారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవ సేవకులకు వేమిరెడ్డి దంపతులు వస్త్ర బహుమానం

- దాదాపు 5 వేల మంది టీటీడీ సిబ్బందికి వస్త్రాల పంపిణీ
- 8 ఏళ్లుగా నిరంతరాయంగా సేవ
- స్వామివారిపై నిశ్చల భక్తికి, సేవానిరతికి ఇది నిదర్శనం: టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర



తిరుమల( సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ తిరుపతి జిల్లా ; తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో స్వామివారి సేవలో నిమగ్నమై భక్తిశ్రద్ధలతో విధులు నిర్వహిస్తున్న సుమారు 5,000 మంది టీటీడీ సిబ్బందికి వేమిరెడ్డి దంపతులు ఆదివారం వస్త్ర బహుమానం అందజేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవ సేవకులను గౌరవిస్తూ వేమిరెడ్డి దంపతులు చేపడుతున్న ఈ సేవ గత 8 ఏళ్లుగా నిరంతరంగా కొనసాగుతోంది. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , టీటీడీ బోర్డు సభ్యులు, కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తిరుమలలోని వైభవోత్సవ మండపంలో జరిగిన కార్యక్రమంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి చేతుల మీదుగా సిబ్బందికి వస్త్రాలను పంపిణీ చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగంగా స్వామివారి సేవలో భాగస్వాములవుతున్న ఆలయ అర్చకులు, పోటు సిబ్బంది, వాహన బేరర్లు, మంగళవాయిద్య (మేళం) బృందం, కల్యాణకట్ట సిబ్బంది, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులు, ఎలక్ట్రిసిటీ విభాగం ఉద్యోగులు తదితరులతో పాటు టీటీడీకి అనుసంధానంగా వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న సిబ్బంది అందరికీ వస్త్ర బహుమానం అందజేశారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్న సిబ్బందిని గౌరవించి, వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ వస్త్ర బహుమానాన్ని అందించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు శ్రీవారి సేవకులకు వస్త్ర బహుమానం అందించడం అభినందనీయమన్నారు. స్వామివారి సేవలో నిరంతరం భాగస్వాములవుతున్న సిబ్బందిని గౌరవిస్తూ, వారిని ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) ఎలాంటి అవసరం వచ్చినా, ఏదైనా సహాయం కోరినా వేమిరెడ్డి దంపతులు వెంటనే స్పందించి అండగా నిలుస్తారని ఈవో తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారిపై వారికి ఉన్న భక్తికి, సేవానిరతికి ఈ సేవ ఒక నిదర్శనమని పేర్కొన్నారు. శ్రీవారి కృపాకటాక్షాలు వేమిరెడ్డి దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

- జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ
- పిజిఆర్ఎస్ పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి
- జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి ( సింధూర దర్శిని) సెప్టెంబర్ తిరుపతి జిల్లా ; జిల్లా కలెక్టరేట్ లో ఈనెల 21 ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు అలాగే పిజిఆర్ఎస్ పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయాలన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 21 వ తేదీన సోమవారం తిరుపతి కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామ న్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సీఎం పర్యటన విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి

## పర్యటన ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి



కుప్పం (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 21వ తేదీ నుండి 22 తేదీ వరకు కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల పాటు పర్యటించనున్న నేపథ్యంలో భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం నాయుడు, ముఖ్యమంత్రి పర్యటన లైసెన్ ఆఫీసర్ పి వెంకటేష్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, కుప్పం రైల్వే స్టేషన్ సూపర్డెంట్ తో కలిసి ఆదివారం పర్యటనకు సంబంధించిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తుంసి ఎలిప్యాడ్ శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి చేరుకుంటారు. అక్కడ హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ జలహారతి స్థలాన్ని పరిశీలించారు. కుప్పం నియోజకవర్గంలో రైతు బజార్‌కు శంకుస్థాపన స్థలాన్ని పరిశీలించారు. సహా కుప్పం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తారు. రూ. 289.5 కోట్ల విలువైన పనులు ప్రారంభించు కోవడంతో పాటు...రూ. 38.5 కోట్ల విలువైన పనులకు సీఎం శంకుస్థాపనలు చేస్తారు. స్వర్ణ కుప్పం విజయాలను ప్రదర్శించే వీడియోను వీక్షిస్తారు. లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడతారు. కుప్పం కొత్తపేటలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. “స్వర్ణ కుప్పం” అచీవ్‌మెంట్స్ గ్యాలరీని సందర్శిస్తారు. హిందాల్కో ప్రతినిధులతో సమావేశమవుతారు. జాతీయ రహదారి ప్రాజెక్టులపై సమీక్షిస్తారు. ఆరోజు రాత్రి... దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పం రైల్వే స్టేషన్‌లో అదనపు హాల్ట్‌ను స్థలాన్ని పరిశీలించారు. కడపల్లి నందు ముఖ్యమంత్రి పాల్గొన్న కేడర్ మీటింగ్ సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా స్థలాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి జల హారతి నందు, బహిరంగ సభ నందు, ముఖ్యమంత్రి పాల్గొన్న ప్రదేశాలలో పటిష్టమైన భారీకేడ్లు, రైల్వే స్టేషన్ నందు భద్రత చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను అత్యున్నత ప్రమాణాలతో అమలు చేయడంతో పాటు ట్రాఫిక్ నిర్వహణ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భద్రతా విభాగం జారీ చేసే సూచనలను ప్రతి శాఖ తప్పనిసరిగా పాటించి సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీకేఎం యూడీఏ చైర్మన్ సురేష్ బాబు వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, బెంగళూరు జోన్ కు సంబంధించిన రైల్వే అధికారులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల ఐక్యత, సంక్షేమం కోసం నూతన కార్యవర్గం సమష్టిగా పనిచేయాలి

- నెల్లూరు అర్బన్ ఆర్య వైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి
- అధ్యక్షుడు మునగా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కోట రమేష్ బాబు, కోశాధికారి జేవీ చలపతి రావులకు శుభాకాంక్షలు
- అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ నూతన కార్యవర్గం ఏర్పాటు
- ఎలాంటి మనస్పర్థలకు తావులేకుండా పదవుల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలి
- ఆర్యవైశ్యుల ఐక్యత, సంక్షేమం కోసం టీజీ వెంకటేష్ ఎంతో కృషి చేశారు



నెల్లూరు (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు అర్బన్ ఆర్య వైశ్య సంఘం నూతన కార్యవర్గం ఆర్యవైశ్యుల ఐక్యత, సంక్షేమం కోసం సమష్టిగా పనిచేస్తూ మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం సాయంత్రం నెల్లూరులో నిర్వహించిన నెల్లూరు అర్బన్ ఆర్య వైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపీ వేమిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

### ఆర్యవైశ్యుల సంక్షేమానికి టీజీ వెంకటేష్ సేవలు

ఈ కార్యక్రమానికి విచ్చేసిన మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ గారంటే తనకు ఎంతో గౌరవమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. రాజ్యసభలో ఆయన తో కలిసి పనిచేసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. టీజీ వెంకటేష్ ఎంతో మర్యాదస్తుడని, ఆర్యవైశ్యుల ఐక్యత, సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆర్యవైశ్య వర్గానికి చెందిన టీజీ వెంకటేష్ ఆ వర్గానికి పెద్ద దిక్కుగా ఉండటం ఆర్యవైశ్యులు చేసుకున్న అదృష్టమని అన్నారు.ఆయన ఏ సమస్యపై దృష్టి పెట్టినా పట్టుదలతో పరిష్కారం కోసం కృషి చేస్తారని, ప్రస్తుతం రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారని ఎంపీ వేమిరెడ్డి తెలిపారు.

### సమష్టిగా ముందుకు సాగాలి

నెల్లూరు అర్బన్ ఆర్య వైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న మునగా నాగేశ్వరరావు , ప్రధాన కార్యదర్శి కోట రమేష్ బాబు , కోశాధికారి జేవీ చలపతి రావు కి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాలకు చెందిన సుమారు 108 మందికి నూతన కార్యవర్గంలో భాగస్వామ్యం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులంతా ఐకమత్యంతో ముందుకు సాగుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఉపయోగపడే మంచి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. కార్యవర్గంలో సభ్యుల సంఖ్య పెరిగినప్పుడు భిన్నాభిప్రాయాలు, మనస్పర్థలు వచ్చే అవకాశం ఉంటుందని, అయితే వాటికి తావులేకుండా అందరూ సమన్వయంతో పనిచేస్తూ తమ పదవుల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ , సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రూ.58,850 నుంచే.. 75 కిలోమీటర్ల మైలేజీ.. తక్కువ ధరలో బెస్ట్ బైక్స్ ఇవే..!

- బైక్‌ల ధరలు రూ.58,850 నుంచి ప్రారంభం
- టీవీఎస్ రేడియన్ అత్యంత చౌక మోడల్ కొన్ని బైక్‌లు 70-75 కిమీ మైలేజీ ఇచ్చే అవకాశం
- హెచ్ఎఫ్ డీలక్స్, హెచ్ఎఫ్ 100 ధరలు రూ.60 వేల లోపే
- షైన్ 100 ధర రూ.65,642
- ప్లాటినా 100లో 200 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్
- రోజువారీ ప్రయాణాలకు బైక్ కొనాలని చూస్తున్నారా?



పెట్రోల్ ఖర్చు తగ్గడంతో పాటు బైక్ ధర కూడా అందుబాటులో ఉండాలంటే 100సీసీ నుంచి 115సీసీ విభాగంలోని కమ్యూటర్ మోడళ్లు మంచి ఆప్షన్‌గా ఉంటాయి. ఈ విభాగంలో రూ.58,850 నుంచే బైక్‌లు అందుబాటులో ఉన్నాయి. వాస్తవ వినియోగంలో లీటరుకు 65 నుంచి 75 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇస్తాయని కంపెనీలు పేర్కొంటున్న మోడళ్లు కూడా ఉన్నాయి. ఆ బైక్‌ల వివరాలు ఇవి..

### టీవీఎస్ రేడియన్.. రూ.58,850

ఈ జాబితాలో తక్కువ ధరతో లభించే బైక్‌ల్లో టీవీఎస్ రేడియన్ ఒకటి. రెట్రో డిజైన్, క్రోమ్ ఫినిష్ హెడ్‌ల్యాంప్, సౌకర్యవంతమైన సీటు దీని ప్రత్యేకతలు. 109.7సీసీ ఇంజిన్ 8.19 పీఎస్ పవర్, 8.7 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. రోజువారీ వినియోగంలో సుమారు 65-70 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని పేర్కొంటున్నారు.

### టీవీఎస్ స్పోర్ట్.. రూ.59,100

స్పోర్టీ డిజైన్‌తో కనిపించే టీవీఎస్ స్పోర్ట్‌లో 109.7సీసీ ఇంజిన్ ఉంది. ఇది 8.29 పీఎస్ పవర్, 8.7 ఎన్ఎం టార్క్ ఇస్తుంది. ఎలక్ట్రిక్ స్టార్ట్, ఎకానమీ, పవర్ మోడ్ సూచికలు, సింక్రనైజ్డ్ బ్రేకింగ్ టెక్నాలజీ వంటి ఫీచర్లు ఉన్నాయి. వాస్తవ వినియోగంలో 70-75 కిలోమీటర్ల వరకు మైలేజీ వస్తుందని కంపెనీ పేర్కొంటోంది.

### హీరో హెచ్ఎఫ్ డీలక్స్.. రూ.59,477

97.2సీసీ ఇంజిన్‌తో వచ్చే హెచ్ఎఫ్ డీలక్స్ సాధారణ, తక్కువ నిర్వహణ ఖర్చుతో కూడిన కమ్యూటర్ బైక్ గా నిలుస్తుంది. 8.02 పీఎస్ పవర్, 8.05 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఐ3ఎస్ టెక్నాలజీ, అల్లాయ్ వీల్స్, సైడ్‌స్టాండ్ ఇంజిన్ కటాఫ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. సుమారు 65-70 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని పేర్కొంటున్నారు.

### హీరో హెచ్ఎఫ్ 100.. రూ.59,839

హెచ్ఎఫ్ 100లో 97.2సీసీ ఫ్యూయల్ ఇంజెక్టెడ్ ఇంజిన్ ఉంటుంది. 8.02 పీఎస్ పవర్, 8.05 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. అనలాగ్ మీటర్, కిక్ స్టార్ట్, డ్రమ్ బ్రేక్‌లు, ఇంటిగ్రేటెడ్ బ్రేకింగ్ సిస్టమ్ ఉన్నాయి. తక్కువ నిర్వహణ ఖర్చుతో రోజువారీ ప్రయాణాలకు ఉపయోగపడేలా దీనిని రూపొందించారు.

### హోండా షైన్ 100.. రూ.65,642

షైన్ 125 తరహా డిజైన్‌తో కనిపించే షైన్ 100లో 98.98సీసీ ఇంజిన్ ఉంటుంది. 7.38 పీఎస్ పవర్, 8.05 ఎన్ఎం టార్క్ అందిస్తుంది. పొడవైన సీటు, ఈఎస్‌పీ టెక్నాలజీ, కాంబి బ్రేక్ సిస్టమ్, సైడ్‌స్టాండ్ ఇంజిన్ కటాఫ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. సుమారు 65-68 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని పేర్కొంటున్నారు.

### బజాజ్ ప్లాటినా 100.. రూ.70,511

ప్లాటినా 100లో 102సీసీ డీటీఎస్-ఐ ఇంజిన్ ఉంటుంది. ఇది 7.9 పీఎస్ పవర్, 8.3 ఎన్ఎం టార్క్ ఇస్తుంది. కంఫర్టెక్ సీటు, నైట్రాక్స్ సస్పెన్షన్, 200 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. వాస్తవ వినియోగంలో 70-75 కిలోమీటర్ల వరకు మైలేజీ వస్తుందని పేర్కొంటున్నారు.

### బజాజ్ సిటీ 110ఎక్స్.. రూ.74,390

రఫ్ అండ్ టఫ్ లుక్‌తో కనిపించే సిటీ 110ఎక్స్‌లో 115.45సీసీ ఇంజిన్ ఉంటుంది. 8.6 పీఎస్ పవర్, 9.81 ఎన్ఎం టార్క్ అందిస్తుంది. క్రాష్ గార్డులు, రియర్ లగేజ్ క్యారియర్, సెమీ నాబీ టైర్లు, బెల్లీ పాన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. 170 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్, కాంబి బ్రేకింగ్ సిస్టమ్ కూడా ఉన్నాయి.

### హీరో స్ప్లెండర్ ప్లస్.. రూ.77,777

భారత్‌లో అత్యంత గుర్తింపు పొందిన కమ్యూటర్ బైక్‌లలో స్ప్లెండర్ ప్లస్ ఒకటి. 97.2సీసీ ఇంజిన్ 8.02 పీఎస్ పవర్, 8.05 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఐ3ఎస్ టెక్నాలజీ, ఎలక్ట్రిక్ స్టార్ట్, ట్యూబ్‌లెస్ టైర్లు, ఇంటిగ్రేటెడ్ బ్రేకింగ్ సిస్టమ్ ఉన్నాయి. సుమారు 65-70 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని పేర్కొంటున్నారు.

**గమనిక:** పై ధరలన్నీ ఎక్స్‌షోరూం ధరలు. దీనికి పన్నులు, ఇతర ఛార్జీలు అదనంగా ఉంటాయి. డీలర్లను సంప్రదిస్తే వాస్తవంగా చెల్లించాల్సిన మొత్తం ఎంతో తెలుస్తుంది. ఆయా కంపెనీల వెబ్‌సైట్‌లోనూ ధరల వివరాలు ఉంటాయి.

# పాడుబడిన హాస్టల్‌లో గంజాయి.. ఇద్దరి అరెస్టు

**430 గ్రాముల గంజాయి, 9 టాపెంటాడోల్ టాబ్లెట్లు స్వాధీనం**

బాపట్ల (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ పాడుబడిన హాస్టల్ భవనంలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను చుండూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 430 గ్రాముల గంజాయి, 9 టాపెంటాడోల్ టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆనంద్ తెలిపారు. చుండూరు మండలం మోదుకూరు గ్రామ శివారులోని పాడుబడిన హాస్టల్ భవనంలో కొందరు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ అనిల్‌కుమార్ సిబ్బందితో కలిసి శనివారం దాడి చేశారు. అక్కడ గంజాయి సేవిస్తున్న కంబాల శ్రీనాథ్‌రెడ్డి (22), మొవ్వ వంశీ (22)లను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై క్రైం నంబర్ 57/2026 కింద ఎన్‌డీపీఎస్ యాక్ట్, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ సంబంధిత సెక్షన్లతో కేసు నమోదు చేశారు. నిందితులను ఆదివారం తెనాలి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ వెల్లడించారు. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల విక్రయం, వినియోగంపై నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# ప్రియుడితో వెళ్లి తిరిగొచ్చిన భార్య.. ముక్కు కొరికేసిన భర్త!

- ప్రియుడితో వెళ్లి రెండున్నర నెలల తర్వాత తిరిగొచ్చిన భార్య
- ఆమే తన ప్రైవేట్ భాగాలను కొరికిందని భర్త ఫిర్యాదు
- పది సంవత్సరాల క్రితం వివాహం, ముగ్గురు సంతానం

**ఉత్తరప్రదేశ్:** పదేళ్లు కలిసి కాపురం చేశారు... ముగ్గురు ఆడపిల్లలకు జన్మనిచ్చారు... కానీ, వారి సంసార బంధంలో నమ్మకం అనే పునాది కదిలిపోయింది. ప్రియుడి మోజులో భార్య దారితప్పితే, తిరిగివచ్చిన ఆమెను క్షమించలేని భర్త దారుణంగా ప్రవర్తించాడు. క్షణికావేశం, పంతం, పగ వారి బంధాన్ని పాతాళానికి తొక్కేశాయి. ఒకరిపై ఒకరు దాడి చేసుకుని, సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించారు.తన ముక్కు కొరికి భర్త పైశాచిక ఆనందం పొందాడని ఆమె ఆరోపిస్తుంటే, అసలు దాడికి దిగింది ఆమేనని, భర్త మర్మాంగాలను కొరికిందని అతడి కుటుంబం ఎదురుదాడికి దిగింది. ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయి జిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన, చిన్నాభిన్నమైన కుటుంబ వ్యవస్థకు అద్దం పడుతోంది. దీపక్, సాధన (27) దంపతులకు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు. అంతా సవ్యంగానే ఉందనుకుంటున్న తరుణంలో, సుమారు రెండున్నర నెలల క్రితం సాధన అదృశ్యమైంది. తన భర్త స్నేహితుడితోనే ఆమె వెళ్లిపోయిందని తెలియడంతో దీపక్ కుమిలిపోయాడు. అప్పట్లో ఈ విషయంపై పోలీస్ పంచాయితీ జరిగినా, సమస్య సద్దుమణగలేదు.అయితే, గురువారం కథ అనూహ్య మలుపు తిరిగింది. సాధన పక్కింటి పైకప్పు మీద నుంచి దూకి, నాటకీయ ఫక్కీలో భర్త ఇంట్లోకి ప్రవేశించింది. ఆమె రాకతో ఇంట్లో ఒక్కసారిగా ఉద్రిక్తత పెరిగింది. మాటల యుద్ధం కాస్తా దాడికి దారితీసింది. "నన్ను చూసిన వెంటనే భర్త దీపక్, అత్తమామలు దాడికి పాల్పడ్డారు. నా చేతులను వారు గట్టిగా పట్టుకోగా, భర్త నా ముక్కును కొరికి, దాన్ని మురుగు కాలువలో పడేశాడు" అని బాధితురాలు సాధన కన్నీటిపర్యంతమైంది. తీవ్ర రక్తస్రావంతో ఉన్న ఆమెను వెంటనే హర్దోయి మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు.సాధన ఆరోపణలు తీవ్రంగా ఉండగా, భర్త దీపక్ కుటుంబం చెబుతున్న కథనం పూర్తి భిన్నంగా ఉంది. "సాధన హఠాత్తుగా ఇంట్లోకి వచ్చి పిల్లలను బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించింది. మేము అడ్డుకోవడంతో మాపైనే దాడికి దిగింది. ఈ క్రమంలోనే నా కొడుకు దీపక్ మర్మాంగాలను కొరికి తీవ్రంగా గాయపరిచింది. ఆ తర్వాత తనను తాను గాయపరుచుకునేందుకు, సానుభూతి పొందేందుకు తలను నేలకేసి కొట్టుకుంది" అని దీపక్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న పోలీసులు దీపక్‌ను అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాధన ఇప్పటివరకు అధికారికంగా ఫిర్యాదు చేయలేదు. అయితే, ఈ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు వారి ఆరోపణల్లో నిజానిజాలు తేల్చేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

# కొనుగోలుదారులకు స్వల్ప ఊరట... స్థిరంగా పసిడి ధర

**రెండు రోజుల పెరుగుదల తర్వాత స్థిరంగా బంగారం ధరలు**

**హైదరాబాద్‌లో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ. 1,55,840**

**రూ. 2,60,000 వద్ద నిలకడగా వెండి ధర**



హైదరాబాద్, (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ గత రెండు రోజులుగా భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలకు ఆదివారం బ్రేక్ పడింది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో పసిడి, వెండి ధరల్లో నేడు ఎటువంటి మార్పు నమోదు కాలేదు. గత కొన్ని రోజులుగా ధరల పెరుగుదలతో ఆందోళన చెందుతున్న కొనుగోలుదారులకు ఇది స్వల్ప ఊరటనిచ్చే అంశం.ఆదివారం ఉదయం నాటికి.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,55,840 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. అదేవిధంగా, 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,42,850 వద్ద ఉంది. వెండి ధరలోనూ ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 2,60,000 వద్ద నిలకడగా ఉంది. వరంగల్, విశాఖపట్నం, విజయవాడ నగరాల్లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి.అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న పరిణామాల ప్రభావంతో గత రెండు రోజులుగా పసిడి ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 4,378 డాలర్ల వద్ద ఉండగా, స్పాట్ సిల్వర్ ఔన్సు ధర 66 డాలర్ల ఎగువన ట్రేడ్ అవుతోంది.రానున్న పండుగల సీజన్ దృష్ట్యా మార్కెట్‌లో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని, ఫలితంగా ధరలు మరింత బలంగానే కొనసాగవచ్చని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, బులియన్ మార్కెట్ ధరల్లో రోజువారీ హెచ్చుతగ్గులు సహజమని, వినియోగదారులు బంగారం కొనుగోలు చేసే ముందు స్థానిక నగల దుకాణాల్లో తాజా ధరలను సరిచూసుకోవాలని సూచిస్తున్నారు.



## ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు

- ఈ ఏడాది 12 రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- సెప్టెంబర్ 25న హుస్సేన్ సాగర్‌లో విగ్రహ నిమజ్జనం
- శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిగా దర్శనమిస్తున్న వినాయకుడు
- అనంత చతుర్దశి రోజున నిమజ్జన కార్యక్రమం:

హైదరాబాద్, – సంరక్షణ : హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తేదీ ఖరారైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 25న, శుక్రవారం రోజున గణనాథుడిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. అనంత చతుర్దశి పర్వదినం సెప్టెంబర్ 25న రావడంతో, అదే రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ సంవత్సరం ఖైరతాబాద్ వినాయకుడు "శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి"గా భక్తులకు దర్శనమిస్తుండడం తెలిసిందే. ప్రతి ఏటా 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు, ఈసారి ఒక రోజు అదనంగా 12 రోజుల పాటు కొనసాగనుండటం విశేషం. దీంతో భక్తులకు స్వామి వారిని దర్శించుకునేందుకు అదనపు సమయం లభించనుంది.

ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా భారీ ఏర్పాట్ల మధ్య మహాగణపతిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిమజ్జనం తేదీ ఖరారు కావడంతో, భక్తులు మరియు నగర వాసులలో ఉత్సాహం నెలకొంది.

## సూర్యాపేటలో ఘోర ప్రమాదం.. కారులో సజీవదహనమైన వైద్యుడు

- డివైడర్‌ను ఢీకొట్టి కారులో చెలరేగిన మంటలు
- ఖమ్మం న్యూరో సర్జన్ కాసకుర్తి జగదీశ్ సజీవదహనం
- తలుపులు లాక్ అవ్వడంతో బయటకు రాలేకపోయిన వైద్యుడు



సూర్యాపేట, – సంరక్షణ : సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి, అందులో ప్రయాణిస్తున్న ప్రముఖ న్యూరో సర్జన్ సజీవదహనమయ్యారు. ఈ విషాద ఘటన పిల్లలమర్రి శివారులోని హైదరాబాద్–ఖమ్మం జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కాసకుర్తి జగదీశ్, తన కారులో ఖమ్మం వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పిల్లలమర్రి వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు కారు మొత్తం వ్యాపించడంతో డోర్లు లాక్ అయ్యాయి. దీంతో డాక్టర్ జగదీశ్ బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. అగ్నిగోళంలా మారిన కారులో ఆయన మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. రహదారిపై వెళ్తున్న ఇతర వాహనదారులు ఈ దృశ్యాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైభవంగా సువర్ణ సిద్ధి లక్ష్మి-బుద్ధి లక్ష్మీ తలంబ్రాల ఉత్సవం



బాపట్ల, (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ : శ్రీ భావనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ సంపత్ గణపతి పరివార్ ఆధ్వర్యంలో 36 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సంపత్ గణపతి నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సువర్ణ సిద్ధి లక్ష్మి, బుద్ధి లక్ష్మీ తలంబ్రాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహి ంచా రు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్ర మాలు చేపట్టారు. భక్తులు గణపతికి గరిక పూజ నిర్వహి ంచి భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలిచారు. అనంతరం సువర్ణ సిద్ధి లక్ష్మి, బుద్ధి లక్ష్మీ తలంబ్రాల ఉత్సవాన్ని సంప్ర దాయబద్ధంగా నిర్వహించారు. ఉత్సవం లో భాగంగా శ్రీ లక్ష్మీ శ్రీనివాస కోలాటం బృందం సభ్యులు ప్రదర్శించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ వస్త్రధారణతో కళాకారులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది.

# బీపీ చెక్ చేసుకుంటున్నారా? ఈ చిన్న జాగ్రత్తలు తప్పనిసరి!



- బీపీ రీడింగ్ కచ్చితత్వానికి కొలిచే విధానం చాలా ముఖ్యం
- పరీక్షకు ముందు 5 నిమిషాలు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవాలి
- వెన్నుకు ఆసరాగా, పాదాలు నేలపై ఆన్చి కూర్చోవాలి
- పరీక్ష సమయంలో మాట్లాడకూడదు, కదలకుండా ఉండాలి
- ఒక్క రీడింగ్‌తో హై బీపీగా భావించవద్దు, వైద్యులను సంప్రదించాలి

ఆధునిక జీవనశైలిలో రక్తపోటు (బీపీ)ను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం చాలా సాధారణమైపోయింది. అయితే, చాలామందికి బీపీ కొలిచే సరైన విధానం తెలియక తప్పుడు రీడింగులు పొందుతుంటారు. ఈ రీడింగ్‌ల ఆధారంగా ఆందోళన చెందడం లేదా చికిత్సలో మార్పులు చేసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. కచ్చితమైన ఫలితం కోసం కొన్ని కీలకమైన జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

### పరీక్షకు ముందు ఇవి ముఖ్యం

బీపీ పరీక్షించుకోవడానికి కనీసం ఐదు నిమిషాల ముందు ప్రశాంతంగా ఒకచోట కూర్చోవాలి. టీ, కాఫీ వంటివి తాగినా, వ్యాయామం చేసినా, పొగతాగినా కనీసం 30 నిమిషాల తర్వాతే బీపీ కొలవాలి. ఈ పను లు చేసిన వెంటనే పరీక్షించుకుంటే రీడింగులలో తేడాలు వస్తాయి.

### కొలిచేటప్పుడు సరైన పద్ధతి

పరీక్ష సమయంలో వెన్నుకు పూర్తిగా ఆసరా ఉండేలా నిటారుగా కూర్చోవాలి. రెండు పాదాలను నేలపై సమంగా ఆనించాలి. కాళ్లు ఒకదానిపై ఒకటి వేసుకోకూడదు. బీపీ కఫ్‌ను మోచేతి పైభాగంలో, చర్మానికి తగిలేలా మాత్రమే బిగించాలి. దుస్తుల మీద నుంచి కఫ్ చుట్టడం సరైన పద్ధతి కాదు. పరీక్ష చేసే చేతిని టేబుల్‌పై గుండెకు సమానమైన ఎత్తులో ఉంచి, పరీక్ష పూర్తయ్యే వరకు మాట్లాడకుండా, కదలకుండా ఉండటం అత్యంత ముఖ్యం.

### రీడింగ్‌పై అవగాహన అవసరం

ఒకేసారి వచ్చిన రీడింగ్‌ను ప్రామాణికంగా తీసుకోకూడదు. నిమిషం విరామంతో రెండుసార్లు బీపీ కొలిచి, ఆ సగటును నమోదు చేసుకోవడం ఉత్తమమైన పద్ధతి. ఒకవేళ బీపీ రీడింగ్ 140/90 ఎఎంహ్స్ర కంటే ఎక్కువగా వచ్చినంత మాత్రాన హై బీపీ ఉందని ఆందోళన చెందవద్దు. వేర్వేరు సమయాల్లో తీసుకున్న రీడింగుల ఆధారంగా మాత్రమే వైద్యులు ఒక నిర్ధారణకు వస్తారు. రీడింగ్ 180/120 దాటితే మాత్రం తక్షణమే వైద్య సలహా తీసుకోవాలి.సరైన పద్ధతిలో క్రమం తప్పకుండా బీపీని పర్యవేక్షించుకోవడం ద్వారా మన గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మీ బీపీని తెలుసుకోండి, ఆరోగ్యంగా జీవించండి.

# స్వాతంత్ర్య సంగ్రామం గత చరిత్ర కాదు.. మన వారసత్వ సంపద: చాగంటి కోటేశ్వరరావు



- త్యాగధనుల చరిత్రను తెలుసుకున్నప్పుడే దేశభక్తి పెరుగుతుందని వెల్లడి
- భారతీయం అనే పదం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలోనే పుట్టిందని గుర్తుచేసిన చాగంటి
- దేశభక్తి ఉన్న లోకేశ్ విద్యామంత్రి కావడం విద్యార్థుల అదృష్టమని ప్రశంస
- స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను పిల్లలకు బహుమతిగా ఇవ్వాలని పిలుపు

కాకినాడ (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ దేశ స్వాతంత్ర్య సంగ్రామం అనేది కేవలం గడిచిపోయిన చరిత్ర కాదని, అది తరతరాలకు అందించాల్సిన మనందరి వారసత్వ సంపద అని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఎందరో మహనీయుల త్యాగాల పునాదులపై నిర్మితమైన స్వేచ్ఛ విలువను ప్రతి ఒక్కరూ గుర్తించి, దాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ.. "ఒక తండ్రి తన జీవితాంతం కష్టపడి ఆస్తులు సంపాదించి పిల్లలకు ఇస్తాడు. ఆ సంపద వెనుక తన శ్రమ, త్యాగం ఉన్నాయని పిల్లలు గ్రహించాలని కోరుకుంటాడు. లేదంటే ఆ సంపదను నిలబెట్టుకోలేరని భయపడతాడు. మన స్వాతంత్ర్యం కూడా అలాంటిదే. ఎందరో మహనీయులు తమ ప్రాణాలను పణంగా పెట్టి మనకు ఈ స్వేచ్ఛను అందించారు. కేవలం ఆ స్వేచ్ఛను అనుభవించడమే కాదు, దాని వెనుక ఉన్న త్యాగాల విలువను అర్థం చేసుకుని, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత" అని ఉద్బోధించారు.'భారతీయం' స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో పుట్టిన పదం "భారతీయం అనే మాట ఇప్పుడు పుట్టింది కాదు. స్వాతంత్ర్య పోరాట సమయం లో, సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం జరిగినప్పుడు పుట్టింది. 'భారతదేశం గురించి నిర్ణయాలు భారతీయులే తీసుకోవాలి', 'సైమన్ గో బ్యాక్' అనే నినాదాలతో ప్రజలు ఉద్యమించారు. భారతీయం లేని సైమన్ మాకు వద్దంటూ నినదించారు. అప్పుడే ఈ పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇలాంటి విషయాలను మనం నిరంతరం చర్చించుకుంటూ ఉం డాలి. అప్పుడే పిల్లలకు మన చరిత్రపై అవగాహన, దేశంపై భక్తి కలుగుతాయి. లేదంటే నైతిక విలువలు నశించిపో తాయి" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### త్యాగాల స్ఫూర్తితో దేశభక్తిని నింపుకోవాలి

స్వాతంత్ర్య సమరయోధులు అనుభవించిన కష్టాలను వివరిస్తూ, "అండమాన్‌లోని కాలాపాని జైలు గురించి చదివితే వారి త్యాగాలు మనసును కదిలిస్తాయి. ఇరుకైన గదుల్లో వారు అనుభవించిన నరకం ఊహకు అందనిది. టంగుటూరి ప్రకాశం పంతులు గారు బ్రిటిష్ పోలీసుల తుపాకీకి గుండెను అడ్డుపెట్టి 'ఆంధ్రకేసరి' అయ్యారు. పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి. ఘంటసాల వెంకటేశ్వరరావు గారు కేవలం గొప్ప గాయకుడే కాదు, స్వాతంత్ర్య ఉద్యమంలోనూ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు గారి అంతిమయాత్రలో దేశభక్తి గీతాలు పాడుతూ చివరి వరకు నడిచారు. ఇలాంటి మహనీయుల జీవిత చరిత్రలను పిల్లలకు చదివించాలి. మనకు దేవాలయాలు ఎంత పవిత్రమో, స్వాతంత్ర్య సమరయోధులు నడయాడిన ప్రదేశాలు, వారు బందీలుగా ఉన్న జైళ్లు కూడా అంతే పవిత్రమైనవి. వాటిని సందర్శించడం ద్వారా మన చరిత్రను తెలుసుకుని, దేశభక్తిని పెంపొందించుకోవచ్చు" అని చాగంటి సూచించారు.

### లోకేశ్‌పై చాగంటి ప్రశంసలు

ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై చాగంటి కోటేశ్వరరావు ప్రశంసలు కురిపించారు. "పిల్లల్లో దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ 'భారతీయం' కార్యక్రమం గురించి చెప్పడానికి మంత్రి లోకేష్ గారి ఇంటికి వెళ్లాను. ఆయన వెంటనే స్పందించి తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి చెప్పిన సమయం కంటే ముందే వచ్చి హాజరయ్యారు. ఆయనలో దేశం, చరిత్ర పట్ల ఉన్న ఆసక్తికి ఇది నిదర్శనం. తిరిగి వెళ్తున్నప్పుడు నా కారు వద్దకు వచ్చి, డ్రైవర్‌తో జాగ్రత్తగా తీసుకెళ్లమని చెప్పడం ఆయన సంస్కారాన్ని తెలియజేస్తుంది. ఇంతటి దేశభక్తి, పెద్దల పట్ల గౌరవం ఉన్న వ్యక్తి మన రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి కావడం విద్యార్థుల అదృష్టం" అని అభినందించారు. స్వాతంత్ర్యం మనకు ఊరికే రాలేదని, దాని వెనుక ఉన్న త్యాగాలకు మనమే వారసులమని పిల్లలకు అర్థమయ్యేలా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

# బాలాపూర్ వినాయకుడిని దర్శించుకున్న హీరో విజయ్ దేవరకొండ

హైదరాబాద్, (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్ హైదరాబాద్ నగరంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్న వేళ, టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రసిద్ధ బాలాపూర్ గణనాథుని దర్శించుకున్నారు. శనివారం రాత్రి ఆయన బాలాపూర్ మండపానికి విచ్చేసి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డితో కలిసి విజయ్ ఈ పూజలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి, ఇతర



సభ్యులు విజయ్ దేవరకొండను శాలువాతో సత్కరించారు. అనంతరం ఎంతో ప్రఖ్యాతిగాంచిన బాలాపూర్ లడ్డూను ప్రసాదంగా అందజేశారు. విజయ్ దేవరకొండ రాకతో మండపం వద్ద సందడి వాతావరణం నెలకొంది.తమ అభిమాన హీరోను చూసేందుకు యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 'విజయ్ అన్న' అంటూ నినాదాలు చేస్తూ సందడి చేశారు. ఫోటోలు, సెల్ఫీల కోసం ఎగబడటంతో ప్రాంగణమంతా అభిమానులతో నిండిపోయింది. అభిమానుల ఉత్సాహానికి విజయ్ కూడా అభివాదం చేస్తూ స్పందించారు.

# 81 ఏళ్ల వయసులో ప్రపంచ యాత్రలు.. యువతకు స్ఫూర్తినిస్తున్న బామ్మ!

- 81 ఏళ్ల తన బామ్మ వీడియోను పంచుకున్న మనవరాలు మెహర్ తూర్
- వ్యాపారవేత్తగా, ప్రపంచ యాత్రికురాలిగా చురుకైన జీవితం
- ఇటీవలే అలస్కాలో క్రూయిజ్ యాత్రకు వెళ్లొచ్చిన బామ్మ
- కష్టపడి పనిచేస్తూ జీవితాన్ని ఆస్వాదించాలని యువతకు సలహా
- సోషల్ మీడియాలో బామ్మ స్ఫూర్తిపై వెల్లువెత్తిన ప్రశంసలు





81 ఏళ్ల ఓ బామ్మ.. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు. వ్యాపారవేత్తగా, ప్రపంచ యాత్రికురాలిగా ఎంతో చురుకైన జీవితం గడుపుతున్న తన బామ్మ గురించి మనవరాలు, ఎంట్రప్రెన్యూర్ మెహర్ తూర్ పంచుకున్న ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వయసులోనూ ఆమె ఉత్సాహం, జీవనశైలి, ఆత్మవిశ్వాసం నెటిజన్లకు స్ఫూర్తినిస్తున్నాయి. ఈ వీడియోలో మెహర్ తన బామ్మను ఒక వ్యాపారవేత్తగా, యాత్రికురాలిగా పరిచయం చేశారు. ఇటీవల ఏం చేశారని, ప్రయాణాలు ఇంకా కొనసాగిస్తున్నారా? అని మనవరాలు అడగ్గా, ఆ బామ్మ ఎంతో ఉత్సాహంగా స్పందించారు. తాను ఇటీవలే అలస్కాకు క్రూయిజ్ యాత్రకు వెళ్లి వచ్చానని, ఆ ప్రయాణాన్ని చాలా ఆస్వాదించానని చెప్పారు. 81 ఏళ్ల వయసులో ఒంటరిగా వెళ్లారా? అని మెహర్ ఆశ్చర్యంగా ప్రశ్నించగా.. "నేను ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లగలను అనే పూర్తి విశ్వాసం నాకుంది" అని ఆమె ఎంతో ధీమాగా సమాధానమిచ్చారు.

### యువతకు బామ్మ సలహా ఇదే!

అనంతరం నేటి యువతకు మీరిచ్చే సలహా ఏంటని? మనవరాలు అడగ్గా.. ఆ బామ్మ ఎంతో చక్కగా వివరించారు. "యువత తమ జీవితాలను బాగా ఆస్వాదించాలి. కష్టపడి పనిచేయాలి, మంచి ఆహారం తినాలి. అదే సమయంలో తమను తాము జాగ్రత్తగా చూసుకోవడం కూడా చాలా ముఖ్యం" అని ఆమె హితవు పలికారు. తన 81 ఏళ్ల బామ్మ తనకంటే చాలా చురుకుగా ఉంటారని మెహర్ తన పోస్టులో రాశారు. ఆమె ఒంటరిగా జీవిస్తున్నారని, ఇప్పటికీ ప్రపంచ యాత్రలు కొనసాగిస్తున్నారని, కిట్టీ పార్టీలతో ఆమె క్యాలెండర్ నిత్యం బిజీగా ఉంటుందని, ఆమెలోని స్ఫూర్తి అద్భుతమని పేర్కొన్నారు.

### నెటిజన్ల ప్రశంసల వర్షం

ఈ పోస్ట్ సోషల్ మీడియాలో పెట్టగానే వేలాది మంది స్పందించారు. నెటిజన్లు ఆమెపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. "మా ఫేవరెట్ సూపర్‌వుమన్" అని ఒక యూజర్ కామెంట్ చేయగా, "ఆమె చాలా అందంగా ఉన్నారు" అని మరొకరు అన్నారు. **"నేను భవిష్యత్తులో ఇలాంటి బామ్మనే** అవ్వాలనుకుంటున్నాను" అంటూ మరో యూజర్ తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. మొత్తం మీద ఈ బామ్మ జీవనశైలి ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోంది.

# దుబాయ్-కడప ఫ్లైట్ టికెట్లు బుక్ చేస్తున్నారా? ఇది మీకోసమే!




- దుబాయ్-కడప విమాన సర్వీసుపై వదంతులు
- ప్రచారంలో నిజం లేదన్న కడప ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్
- టికెట్ల పేరుతో మోసపోయే ప్రమాదం ఉందని హెచ్చరిక
- సమాచారం కోసం అధికారులను సంప్రదించాలని సూచన

**దుబాయ్:** ఈ నెల 23 నుంచి దుబాయ్-కడప మధ్య ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభం కానున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని కడప విమానాశ్రయ డైరెక్టర్ సుజిత్ కుమార్ పొద్దార్ స్పష్టం చేశారు. ఈ మేరకు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని, ప్రజలు వీటిని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. దుబాయ్-కడప మధ్య విమాన సర్వీసులకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదని డైరెక్టర్ తెలిపారు. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని ఆసరాగా చేసుకుని కొందరు ట్రావెల్ ఏజెంట్లు టికెట్ల పేరుతో ప్రజలను మోసం చేసే ప్రమా దం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రయాణి కులు అనధికారిక వార్తలను నమ్మి టికెట్లు బుక్ చేసుకోవద్దని ఈ సందర్భంగా సూచించారు. భవిష్యత్తులో ఏవైనా అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించాల్సి వస్తే, విమానాశ్రయ అధికారులు అధికారికంగా ప్రకటిస్తారని ఆయన వివరించారు. విమాన సర్వీసులపై ఎటువంటి సందేహాలున్నా సోషల్ మీడియా పోస్టులపై ఆధారపడకుండా, నేరుగా విమానాశ్రయ అధికారులను లేదా సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

# ఏపీలో 9 కొత్త రైల్వే లైన్లు.. పోర్టులకు పెరగనున్న కనెక్టివిటీ

- ఏపీలో కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుకు రైల్వే శాఖ సన్నాహాలు
- పశ్చిమ, మధ్య భారతం నుంచి ఏపీ పోర్టులకు మెరుగైన కనెక్టివిటీ లక్ష్యం
- రాయలసీమ నుంచి పోర్టులకు దూరం
- తగ్గించేలా కీలక ప్రతిపాదనలు
- తెలంగాణ నుంచి శ్రీశైలానికి రైలు మార్గం ఏర్పాటుకు ప్లాన్
- ప్రయాణ సమయం, సరుకు రవాణా ఖర్చులు తగ్గించడమే ప్రధాన ఉద్దేశం



అమరావతి, (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరించే లక్ష్యంతో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానిస్తూ, ముఖ్యంగా ప్రధాన ఓడరేవులను కలుపుతూ మొత్తం 9 కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. మధ్య, పశ్చిమ భారతదేశంలోని తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పోర్టులకు నేరుగా కనెక్టివిటీని పెంచడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన ఉద్దేశం. దీనివల్ల ప్రయాణ దూరంతో పాటు సరుకు రవాణా వ్యయం కూడా గణనీయంగా తగ్గనుంది.

రాయలసీమ, దక్షిణ ప్రాంతాల నుంచి ఓడరేవులకు అనుసంధానాన్ని మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 120 కిలోమీటర్ల పొడవైన రాజంపేట - నెల్లూరు రైల్వే లైన్‌ను ప్రతిపాదించారు. ఇది రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల నుంచి కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులకు నేరుగా రవాణా సౌకర్యాన్ని కల్పిస్తుంది. అలాగే, 41.5 కిలోమీటర్ల మేర గూడూరు - దుగరాజపట్నం పోర్టు లైన్‌కు సంబంధించి తుది లొకేషన్ సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. 88.3 కిలోమీటర్ల పుత్తూరు - అత్తిపట్టు మార్గం చెన్నై ఓడరేవులకు దూరాన్ని తగ్గిస్తుండగా, దీనికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం సిద్ధమవుతోంది. ఉత్తరాంధ్ర, ఏజెన్సీ ప్రాంతాల కనెక్టివిటీకి కూడా రైల్వే శాఖ ప్రాధాన్యమిచ్చింది. 150 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన చింతూరు - సామర్లకోట రైల్వే లైన్ ద్వారా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కాకినాడ పోర్టుతో నేరుగా సంబంధం ఏర్పడుతుంది. అదేవిధంగా, ఇప్పటికే మంజూరైన ఒడిశాలోని తెరుబాలి - గుణుపూర్ (73.6 కి.మీ) లైన్ ములపేట పోర్టుకు సరుకు రవాణాను మరింత సులభతరం చేయనుంది. వీటితో పాటు, తెలంగాణ నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి రైలు మార్గాన్ని అందుబాటులోకి తెచ్చేలా 290 కిలోమీటర్ల పొడవైన సికింద్రాబాద్ - శ్రీశైలం - మార్కాపురం లైన్ కూడా ప్రతిపాదనల్లో ఉంది. గద్వాల - మాచర్ల (184.2 కి.మీ), దొనకొండ - ఒంగోలు (119.6 కి.మీ), దూపాడు - బేతంచెర్ల (53.9 కి.మీ) లైన్లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ మార్గాలు దొనకొండ, ఓర్వకల్ పారిశ్రామిక ప్రాంతాలను ఓడరేవులతో అనుసంధానిస్తాయి. ఈ ప్రాజెక్టులు పట్టాలెక్కితే రాష్ట్ర వాణిజ్య, ఆర్థిక రంగాలు సరికొత్త పుంతలు తొక్కుతాయని భావిస్తున్నారు.

# చేనేత కుటుంబాలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం



రేపల్లె, (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినట్టు నుంచి చేనేత కుటుంబాలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని వైయస్సార్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పిటా నాగమోహన్ కృష్ణ ఆరోపించారు ఆదివారం మండల పరిధిలోని పేటేరు పంచాయతీలో చేనేత మగ్గాలను వారి జీవితాలను వారు పడుతున్న బాధలను చూసి చలించిపోయారు ఈ సందర్భంగా ఇన్చార్జి నాగమోహన్ కృష్ణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో చేనేత భరోసా కింద అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా ఆర్థిక సహా యం అందించే వారిని నేడు అలాంటిదేమీ లేకుండా పార్టీలే ముఖ్యంగా భావిస్తూ అర్హత ఉన్న చేనేత కార్మికు ల కూడా ఆర్థిక సహాయం అందించడంలో వివక్షత చూపుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పట్టేశీ శ్రీనివాసరావు, వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ మేడికొండ అనిల్, పేటేరు గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రావు పిచ్చయ్య బాబు, గ్రామ నాయకులు కున్నెర్ల రామకృష్ణ, దీవి రాంప్రసాద్, గట్టు రాఘవయ్య ,బొట్టు వేమన కుమార్, రావు సాయిరాం, సూరగాని వెంకటేశ్వరావు, పంతగాని కనకరత్నం వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# షూటింగ్‌లో రజతంతో భారత్ బోణీ

- ఎంఎంఏలో చారిత్రక పతకం ఖాయం చేసిన సుచిక
- ఉజ్బెకిస్తాన్‌ను చిత్తు చేసిన మహిళల హాకీ జట్టు
- వుషు, టెక్‌బాల్ క్రీడల్లో నిరాశ
- సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో మహిళల క్రికెట్ జట్టు పోరు

ఆసియా క్రీడల తొలిరోజే భారత్ పతకాల ఖాతా తెరిచింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇలవేనిల్ వలరివన్, సోనమ్ మస్కర్, విదర్సా వినోద్‌లతో కూడిన బృందం చైనా తర్వాత రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇదే తొలి పతకం.

### ఎంఎంఏలో చరిత్ర సృష్టించిన సుచిక

మరోవైపు, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ)లో సుచిక సెమీఫైనల్‌కు దూసుకెళ్లి చరిత్ర సృష్టించింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా ఆమె భారత్‌కు ఈ క్రీడలో తొలి పతకాన్ని ఖాయం చేసింది.

### భారత మహిళల హాక్టీ భారీ విజయం

ఇక భారత మహిళల హాకీ జట్టు తమ ఆరంభ మ్యాచ్‌లో ప్రభంజనం సృష్టించింది. పూల్ మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌పై ఏకంగా 19-0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి తమ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభిం చింది. కొన్ని విభాగాల్లో భారత్‌కు నిరాశ అయితే, కొన్ని విభాగాల్లో భారత్‌కు నిరాశ ఎదురైంది. వుషులో పురుషుల చాంగ్‌క్వాన్ ఫైనల్‌లో సూరజ్ సింగ్ 11వ స్థానంతో సరిపెట్టుకోవడంతో పతకం ఆశలు గల్లంతయ్యాయి. అలాగే, టెక్‌బాల్‌లోనూ భారత్‌కు పతకాలు దక్కలేదు. మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కాంస్య పతక మ్యాచ్‌ల లో భారత క్రీడాకారులు ఓటమి పాలయ్యారు. ఇప్పుడు అందరి దృష్టి మహిళల క్రికెట్ జట్టుపై ఉంది. గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో స్థానం కోసం హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

# ధర్మవరంలో మత సామరస్యం... వినాయక లడ్డూను దక్కించుకున్న ముస్లిం దంపతులు

- ధర్మవరంలో వినాయక లడ్డూ వేలంపాట
- రూ.1.45 లక్షలకు ప్రసాదాన్ని దక్కించుకున్న ముస్లిం దంపతులు
- మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఘటన
- దంపతులను సన్మానించిన ఉత్సవ కమిటీ



ధర్మవరం (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఒక అరుదైన సంఘటన చోటుచేసుకుంది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో చాందిని, మస్తాన్ వలి అనే ముస్లిం దంపతులు రూ. 1,45,000 చెల్లించి ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా అందరి ప్రశంసలు అందుకుంటోంది. పట్టణంలోని పార్థసారథి నగర్, సిరికల్చర్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం ఉత్సవ కమిటీ లడ్డూ వేలంపాట నిర్వహించింది. ఈ వేలంలో పలువురు పోటీ పడగా, చివరికి చాందిని, మస్తాన్ వలి దంపతులు అత్యధిక ధరకు లడ్డూను గెలుచుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో లడ్డూ వేలం వేయడం ఒక సంప్రదాయంగా వస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్‌లోని బాలాపూర్ లడ్డూ వేలం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందే.

# సినిమా న్యూస్

## ‘కాకా’లో చిరు పాత్ర ఇదే.. స్వయంగా లీక్ చేసిన మెగాస్టార్!

**బాబీ కొల్లి దర్శకత్వంలో చిరంజీవి నటిస్తున్న చిత్రం ‘కాకా’**
**‘కదిరి కాళిదాస్’ అలియాస్ ‘సత్యం’గా మెగాస్టార్**
**తండ్రీకూతుళ్ల ఎమోషనల్ డ్రామా సినిమాకు కీలకం**
**2027 సంక్రాంతికి జనవరి 13న విడుదల చేసేందుకు ప్లాన్**

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం ‘కాకా’పై అంచనాలు భారీగా ఉన్నాయి. ‘వాల్తేరు వీరయ్య’ లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరూ కలిసి పనిచేస్తుండటంతో సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి స్వయంగా తన పాత్రకు సంబంధించిన కొన్ని కీలక వివరాలను బయటపెట్టారు.ఇటీవల ఓ సినిమా వేడుకకు హాజరైన చిరంజీవి, ‘కాకా’ చిత్రంలో తన పాత్ర గురించి సరదాగా కొన్ని హింట్స్ ఇచ్చారు. ఈ సినిమాలో ఆయన ‘కదిరి కాళిదాస్’ అలియాస్ ‘సత్యం’ అనే రెండు విభిన్న కోణాలున్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. పైకి ఓ ఆక్వా ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేసే ‘సత్యం’ అనే సాధారణ వ్యక్తిగా కనిపిస్తూనే, తెరవెనుక అండర్‌వాల్డ్‌ను శాసించే ‘కదిరి కాళిదాస్’ అనే మరో శక్తిమంతమైన పాత్రలో ఆయన నటన అబ్బురపరచనుందని సమాచారం.ఈ చిత్రంలో తండ్రీకూతుళ్ల మధ్య సాగే భావోద్వేగభరితమైన కథనం సినిమాకు ప్రాణం పోయనుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి కూతురు ‘అమ్ములు’గా మలయాళ నటి అనశ్వర రాజన్ నటిస్తున్నారు. మెడిసిన్ చదివే విద్యార్థిని పాత్రలో ఆమె కనిపించనున్నారు.
వీరిద్దరి మధ్య వచ్చే ఎమోషనల్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయని తెలుస్తోంది.
కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ కూడా రానుండటంతో మెగా అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.






## రష్మిక వైల్డ్ యాక్షన్.. ‘మైసా’ నుంచి పవర్‌ఫుల్ టీజర్

**గోండు గిరిజన మహిళగా సరికొత్త యాక్షన్ అవతారంలో రష్మిక మందన్న**
**పవర్‌ఫుల్ యాక్షన్ సీన్లతో ఆకట్టుకుంటున్న ‘మైసా’ టీజర్**
**“యుద్ధానికి ఆయుధం ఏ యుద్ధానికి భయపడదు” అనే డైలాగ్ హైలైట్‌గా నిలిచింది**

రవీంద్ర పుల్లే దర్శకత్వంలో వస్తున్న పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల
‘నేషనల్ క్రష్’ రష్మిక మందన్న తన సరికొత్త అవతారంతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘మైసా’ చిత్రం నుంచి విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది.
ఇప్పటివరకు గ్లామరస్, క్యూట్ పాత్రలతో అలరించిన రష్మిక, ఈసారి పూర్తి భిన్నంగా ఒక పవర్‌ఫుల్ యాక్షన్ పాత్రలో కనిపించి అందరికీ షాకిచ్చారు. ఈ టీజర్ ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉంది.
‘మైసా’ టీజర్‌లో రష్మికను ఒక శక్తివంతమైన గోండు గిరిజన మహిళగా చూపించారు. రక్తంతో తడిసిన ముఖం, చేతిలో ఆయుధాలు, తీవ్రమైన పోరాట సన్నివేశాలతో ఆమె లుక్ సినిమాపై అంచనాలను భారీగా పెంచింది. ముఖ్యంగా, “యుద్ధానికి ఆయుధం అంటే భయం కానీ.. ఆయుధం ఏ యుద్ధానికి భయపడదు” అనే డైలాగ్ టీజర్‌కు హైలైట్‌గా నిలిచింది. రష్మిక కెరీర్‌లో ఇది ఒక మేజర్ టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంతో రవీంద్ర పుల్లే దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈయన గతంలో ప్రముఖ దర్శకుడు హను రాఘవపూడి వద్ద సహాయకుడిగా పనిచేశారు. అన్ ఫార్ములా ఫిల్మ్స్ పతాకంపై అనిల్, అజయ్ సయ్యాపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టీజర్‌లోని యాక్షన్ సన్నివేశాలకు జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం మరింత ఉత్కంఠను రేకెత్తించింది. రాహుల్ రవీంద్రన్, రావు రమేశ్ వంటి ప్రముఖ నటులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.
ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ‘మైసా’ చిత్రం 2026, నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## అప్పట్లో ఆ హీరో పెద్ద సరసాల రాయుడు: జయప్రద

- **ఒకప్పటి హీరోలలో ధర్మేంద్ర పెద్ద సరసాల రాయుడని చెప్పిన జయప్రద**
- **రాజేష్ ఖన్నా సెట్‌కు ఎప్పుడూ ఆలస్యంగా వచ్చేవారని వెల్లడి రోజుకు 5 షిఫ్టులు పనిచేస్తూ తీవ్రంగా కష్టపడ్డానని గుర్తుచేసుకున్న నటి**
- **షూటింగ్ కోసం ఎయిర్‌పోర్ట్‌లోనే స్నానం చేసి ఫ్లైట్‌లో మేకప్ వేసుకున్న వైనం**



ఎన్టీఆర్, రాజ్‌కుమార్ వంటి దిగ్గజాలతో 16 ఏళ్లకే పనిచేశానని వెల్లడి ప్రముఖ నటి జయప్రద తన కెరీర్ తొలినాళ్లలోని ఆసక్తికర జ్ఞాపకాలను పంచుకున్నారు. కపిల్ శర్మ షోకు సంబంధించిన ఓ పాత వీడియో క్లిప్ తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోలో ఆమె తన సహనటుల గురించి సరదా వ్యాఖ్యలు చేశారు. ఆ రోజుల్లో హీరోలలో అత్యంత సరసాల రాయుడు ఎవరని కపిల్ అడగ్గా, ఆమె నవ్వుతూ “ధర్మేంద్ర” అని సమాధానమిచ్చారు.ఇక సెట్‌కు ఆలస్యంగా వచ్చే హీరో ఎవరనే ప్రశ్నకు, ఆమె రాజేష్ ఖన్నా పేరు చెప్పారు. “నేను దక్షిణాది నుంచి వచ్చాను. అక్కడ ఉదయం 7 గంటలకే సెట్స్‌లో ఉండేదాన్ని. కానీ బాలీవుడ్‌లో 9 గంటలకు రమ్మనేవారు. నేను మేకప్ పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్నా, రాజేష్ ఖన్నా గారు రాత్రి 8 గంటలకు వచ్చేవారు. వచ్చి వడా పావ్ తిని, ఒక షాట్ ఇచ్చి 9 గంటలకు ప్యాకప్ చెప్పేవారు” అని జయప్రద ఆ నాటి పరిస్థితులను వివరించారు.ఆ రోజుల్లో తాను ఎదుర్కొన్న కష్టాల గురించి కూడా జయప్రద మాట్లాడారు. ఒకే రోజులో 5 షిఫ్టులు కూడా పనిచేసేదాన్నని తెలిపారు. “షరాబి” సినిమా షూటింగ్ సమయంలో ఊటీ నుంచి సాయంత్రం రైలెక్కి చెన్నై చేరుకునేదాన్నని, అక్కడి ఎయిర్‌పోర్ట్‌లోనే స్నానం చేసి ఫ్లైట్ ఎక్కేదాన్నని గుర్తుచేసుకున్నారు. విమానంలో ప్రయాణిస్తూనే మేకప్ పూర్తి చేసుకుని కోయంబత్తూరులో షూటింగ్‌కు హాజరయ్యేదాన్నని చెప్పారు.
ఇలాంటి పరిస్థితులు కష్టంగా ఉన్నప్పటికీ, గర్వంగా అనిపించేదని ఆమె అన్నారు. దక్షిణాదిలో ఎన్టీఆర్, రాజ్‌కుమార్ వంటి దిగ్గజ హీరోలతో పనిచేసేటప్పుడు తాను కేవలం 16-17 ఏళ్ల అమ్మాయినని, వారితో పనిచేయడం వల్ల ఎంతో క్రమశిక్షణ నేర్చుకున్నానని జయప్రద తెలిపారు.

## ‘జైలర్ 2’ నుంచి క్రేజీ అప్‌డేట్.. బోధిగా ఎస్.జె. సూర్య పవర్‌ఫుల్ ఎంట్రీ!




- **జైలర్ 2లో భాగమైన విలక్షణ నటుడు ఎస్.జె. సూర్య**
- **‘బోధి’ పాత్రను పరిచయం చేస్తూ క్యారెక్టర్ ప్రోమో విడుదల**
- **సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారిన ఎస్.జె. సూర్య స్టైలిష్ లుక్**
- **రజనీకాంత్‌తో తొలిసారి తలపడనున్న సూర్య**
- **దసరా కానుకగా అక్టోబర్ 15న థియేటర్లలోకి రానున్న చిత్రం**

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘జైలర్ 2’ నుంచి మేకర్స్ ఓ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో విలక్షణ నటుడు ఎస్.జె. సూర్య ఓ కీలక పాత్రలో నటిస్తుం డగా, ఆయన పాత్రను పరిచయం చేస్తూ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ తాజాగా ఒక క్యారెక్టర్ ప్రోమోను విడుదల చేసింది.ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య ‘బోధి’ అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. విడుదలైన ప్రోమోలో ఆయన స్టైలిష్ లుక్స్, స్వాగ్, బాడీ లాంగ్వేజ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. ఈ ప్రోమోకు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన నేపథ్య సంగీతం సినిమాపై అంచనాలను మరింత పెంచింది.బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన ‘జైలర్’కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రంలో రజనీకాంత్ (ముత్తువేల్ పాండియన్) పాత్రను ఢీకొట్టే పాత్రలో ఎస్.జె. సూర్య (బోధి) నటించనుండటం ఆసక్తి రేపుతోంది. వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662